# తుపాను వెలిసింది



**ఆంధ్రభూమి, 6 ఏప్రిల్ 2000**

"ప్రభా! గంటలో వస్తాను. తలుపేసుకో" అని చెప్పి వెళ్ళిన వ్యక్తి తనుగా తిరిగిరాడనీ, తీసుకురాబడ్తాడనీ వూహించలేదు ప్రతిభ.

పెద్దవాళ్ళ నెదిరించి చేసుకున్న పెళ్లికావటంతో అతను పోవటం ఎవర్నీ టచ్ చెయ్యలేదు. వద్దనుకోగానే బంధుత్వాలన్నీ తెగిపోయాయన్నట్టు వదిలేసారు. ఆఫీసువాళ్ళు ఫ్రెండ్సే అన్నీ చూసుకున్నారు.

"బెనిఫిట్సన్నీ వీలైనంత తొందర్లో వచ్చేలా చూస్తానమ్మా! నువేం అధైర్యపడకు. మేమంతా వున్నాం" అని ధైర్యం చెప్పి, ప్రామిస్ చేసి వెళ్ళాడు ఆఫీసరు.

కాలం ఎంత వేగంగా గడుస్తోంది! అని తిరిగి చూసుకునే వ్యవధి కూడా లేనంత వేగంగా రోజులు దొర్లిపోతున్నాయి. భర్త నాటిన నైట్‌క్వీన్ మొక్క యిప్పటికీ పూలు పూస్తూనే వుంది. పరిమళాలు వెదజల్లుతునే వుంది. కిటికీపక్కని కుర్చీవేసుకుని కూర్చుని ఉస్తాద్ అలీ ఖాన్ షెహనాయ్ వినేవాడతను. కేసెట్లలాగే వున్నాయి. వాటిల్లోని సంగీతమూ అలాగే వుంది. లేనిదల్లా అతనే. ఇల్లంతా అతను లేకపోవడంతో నిండిపోయింది. మనసు క్రమంగా ఆ భావనకి అలవాటుపడుతున్నా జీవనసరళిని మార్చుకోవడం కొంచెం కష్టంగానే వుంది.

"నాన్న కావాలమ్మా!" అని ఏడేళ్ళ బిందు ఏడుస్తుంటే కళ్ళమ్మట నీళ్ళు తిరుగుతున్నాయి. ప్రతిభకి. ఎవరేనా తామిద్దర్నీ గుండెల్లోకి పొదువుకుని లాలించి ఓదారిస్తే ఎంత బావుండును!

చిన్న సంసారం, చీకూచింత లేని సంసారం అంటారు నిజమే! బాధ్యతలు తగ్గేసరికి ఎదుటివారి కష్టాల్లో సానుభూతి చూపించలేనంతగా మనిషి మనోవైశాల్యం కుదించుకుపోతోంది. ఆ మేరకి అహంభావం పెరుగుతోంది.

తన తండ్రికి... ఆయన మాట కాదని పెళ్లి చేసుకుందని తన మీద కోపం. అత్తమామలకీ అంతే. అందులో పట్టువిడుపులు లేవు. వాళ్ళే కాదనుకున్నాక యింకెవరున్నారని తమకి? ఎవరికోసం బతకాలి?

ఏ స్లీపింగ్ పిల్సో మింగి సూసైడ్ చేసుకుందామనే ఆలోచన బలంగా కలిగేది ప్రతిభకి. కానీ బిందుని చూస్తూ ఆ పని చెయ్యలేకపోయేది. రోజులలాగే దొర్లుతున్నాయి.

★★★

భర్త ఆఫీసులోనే కంపాషనేట్ అపాయింట్‌మెంటిచ్చారు ప్రతిభకి. బైటి ప్రపంచంలో అడుగుపెట్టడంతో మూసుకుపోయిన మనోద్వారం తెరుచుకున్నట్టైంది.

పొద్దున్నే తయారవ్వటం, బిందుని స్కూలుకి పంపి, తను ఆఫీసుకెళ్ళటం, మళ్ళీ తిరిగొచ్చేసరికి టీవీ, బిందు హోమ్‌వర్కు. అయిష్టంగానేనా సరే అనివార్యంగా చెయ్యాల్సిన దినచర్య.

అన్నీ తనే చేసుకోవాలి. కూరగాయలు తెచ్చుకోవటం దగ్గిర్నుంచి వంటా, బిందు స్కూల్

ఎఫేర్స్.. ప్రాణం విసిగిపోతోంది.

ఆరోజు...

స్కూల్ రిక్షా రాలేదు. అవతల తనకి ఆఫీసుకి టైమైపోతోంది. సూపర్నెంటు లేటైతే వూరుకోడు.

"ఎలా మమ్మీ? ప్రేయర్ బెల్ అయ్యాక వెళ్తే పనిష్ చేస్తారు" అంటోంది బిందు గుడ్లనీళ్ళు కక్కుకుని. భర్త వుండగా బిందుని టైముకి పంపించలేకపోవటమన్న సమస్య ఎప్పుడూ రాలేదు. అతని కైనటిక్ హోండా షోకేసులో బొమ్మలా వెక్కిరిస్తూ కనిపించింది. తనని నేర్చుకోమనేవాడు తనే శ్రద్ధపెట్టలేదు.

సరిగ్గా అప్పుడే ప్రతిభ కొలిగ్ రామకృష్ణ అటుగా వెళ్తున్నాడు. ఇద్దర్నీ చూసి లూనా స్లోచేసుకుని "ఏంటి మేడమ్? ఎనీ ప్రాబ్లమ్? పాప యింకా స్కూలుకి వెళ్ళలేదు?" అనడిగేడు - కేజువల్‌గా.

"రిక్షా రాలేదంకుల్" బిందు అరచేతుల్తో కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది.

"ఓస్! దానికేనా ఏడుస్తున్నావు?! డ్రాప్ చేస్తాను" అని బిందుని ఎక్కించుకుని వెళ్ళిపోయాడు. పెద్దబరువు దిగినట్లైంది ప్రతిభకి. ఆఫీసుకెళ్ళాక థాంక్స్ చెప్పిందతనికి.

మరో రోజు.

అప్పటికి రెండురోజులైంది ప్రతిభ ఆఫీసుకి వెళ్ళి. ఎందుకు రాలేదోనని వెళ్ళాడతను. తల్లీకూతుళ్ళిద్దరికీ జ్వరం. చేసేవాళ్ళు ఎవరూ లేరేమో, మంచానికి అంటిపెట్టుకుపోయి వున్నారు.

"ప్రతిభా! నాకు ఫోన్ చెయ్యొచ్చుకదా?" కోప్పడ్డాడు రామకృష్ణ. ఆమె పరిస్థితికి అతని హృదయం ద్రవించిపోయింది.

"ఆయనుండి నేను పోయినా బావుండేది. మరో పెళ్ళి చేసుకుని హాయిగా వుండేవారు. ఒక్కదాన్నీ మిగిలిపోయాను. మగ పనీ ఆడ పనీ రెండూ చేసుకోలేక చచ్చిపోతున్నాను" బావురుమంది ప్రతిభ.

"ఛ..ఛ... ఏంటిది? ఇలాంటప్పుడు ఏడుస్తారా? జ్వరం ఎక్కువౌతుంది. ఒంట్లో బాగోలేనప్పుడు నాకు ఫోన్ చేస్తే వచ్చేవాడిని. డాక్టరు దగ్గరికి తీసికెళ్ళేవాడినని అన్నానుగానీ నిన్ను హర్ట్ చెయ్యాలని కాదు. ప్లీజ్! కంట్రోల్ యువర్‌సెల్ఫ్" బుజ్జగిస్తున్నట్టుగా చెప్పాడు.

వెళ్ళి పాలపేకెట్లు, బ్రెడ్డూ తీసుకొచ్చి తనే పాలు కాచాడు. ఇద్దరికీ పాలూ బ్రెడ్డూ యిచ్చి తినిపించాడు. తిన్నాక కాస్త ఓపిక వచ్చింది ప్రతిభకి.

"ఆటో తీసుకొస్తాను. డాక్టరు దగ్గరకి వెళ్ళొద్దాం" అన్నాడు రామకృష్ణ.

"మీకు యిప్పటికే చాలా శ్రమిచ్చాను" ఇబ్బందిగా అంది ప్రతిభ. అతను నవ్వేసాడు. "మా ఆవిడ ఏ వూరో వెళ్ళినప్పుడు నాకు జ్వరం వస్తే మీరూ అన్నీ చేద్దురుగాని" అన్నాడు. ప్రతిభ కూడా నవ్వేసిందిగానీ రెండు విషయాలు ఆమెకి గుండెల్లో ముళ్ళలా గుచ్చుకున్నాయి. మొదటిది అతనికి పెళ్ళై భార్య,, కుటుంబం వుందని - రెండోది అతనెప్పుడూ తమని వాళ్ళింటికి ఆహ్వానించడంగానీ భార్యతో కలిసి తనింటికి రావటంగానీ చెయ్యలేదని. కానీ ఒక బలహీనత ఆమెనా బాధని నవ్వుతూ సహించేలా చేసింది.

రామకృష్ణ ఆటో తీసుకొచ్చాడు. ముగ్గురూ డాక్టరు దగ్గరకి వెళ్ళొచ్చారు. మామూలు జ్వరమేనని చెప్పి, మందులవీ రాసాడు డాక్టరు. అన్నీ కొనిచ్చి, జాగ్రత్తగా వాడమని మరీ మరీ హెచ్చరించి వెళ్ళాడు రామకృష్ణ.

"అమ్మా! అంకుల్ ఎప్పటికీ మనదగ్గిరే వుండిపోతే బావుంటుంది కదూ?" ఆశగా అంది బిందు.

"తప్పు" అంది ప్రతిభ. ఆమాట నాలిక చివర్నించీ వచ్చిందేగానీ అంతరాంతరాలలో ఆమెకీ అలానే అనిపించింది. అంతలోనే నవ్వు కూడా వచ్చింది. టైముకి ఆఫీసుకి చేర్చడం కోసం, బజారు పనుల కోసం, జ్వరమొస్తే డాక్టరు దగ్గిరకి తీసికెళ్ళడం కోసం... యిలాంటి వాటికోసం అతని తోడు కోరుకుంటోందా తను? ఒక పనిపిల్లాడిని వెతుక్కోవాలి. చాలా సమస్యలు తీరతాయి!

★★★

తలంటు పోసుకున్న జుత్తు ఆరబెట్టుకుంటోంది ప్రతిభ. రెండు చెంపల్నీ కప్పేస్తూ భుజాలమీదుగా వళ్ళోకి జారిన వెంట్రుకల పాయలు మధ్యనుంచీ ఆమె మొహం మబ్బుల్లోంచీ తొంగిచూస్తున్న చంద్రబింబంలా వుంది. ఆ దృశ్యాన్ని చాలా విస్మయంగా చూస్తున్నాడు రామకృష్ణ. భార్యలో అలాంటి లాలిత్యం ఎప్పుడూ కనిపించలేదనికి.

అతని చూపుల్లో వచ్చిన మార్పుని గుర్తించింది ప్రతిభ. ఇబ్బందిగా అనిపించింది. ఈ మధ్య తమ మధ్యన అవసరాలకన్నా అనురాగాలు ఎక్కువౌతున్నాయని గుర్తించింది. చాలా చనువుగా యింట్లోకి వచ్చేస్తాడతను. స్వతంత్రంగా కుర్చీలో కూర్చుంటాడు. టీవీ చూస్తూ పొద్దుపోయేదాకా గడుపుతాడు. బిందుతో స్క్రాబ్లెట్, చైనీస్ చెక్కర్ లాంటి గేమ్స్ ఆడతాడు. ఒక్కొక్కసారి తనడిగితే భోజనం కూడా చేస్తాడు. ఆఫీసులో తమ వెనుక గుసగుసలు మొదలయ్యాయి. మరి అతని మనసులో ఏముందో?

"ప్రతిభా!" అన్నాడు రామకృష్ణ.

"చెప్పండి"

"మనం... పెళ్ళి చేసుకుంటే బావుంటుందేమో!"అనేసాడు.

ఆ ప్రస్తావన నచ్చలేదు ఆమెకి. అది మనసులో వూహించుకుని అలా జరిగితే బావుంటుందేమో అనుకోవడంలా లేదు. ఇరుకున పడ్డట్టైంది.

"ఎందుకూ? పెళ్ళి చేసుకోకుండానే ఒక గృహస్థుచేసే పన్లన్నీ.. ఐమీన్.. కూరలు తేవడం లాంటివన్నీ చేస్తూనే వున్నారుగా?" నవ్వులాటగా అనబోయింది.

అతను చురుగ్గా చూసాడు. చూసి కుర్చీలోంచి లేచి వెళ్ళి ఆమెకి అభిముఖంగా కూర్చుని అమె ముఖాన్ని తన రెండు చేతుల్లోకి తీసుకుంటూ దగ్గిరకి రాబోతుంటే చెయ్యడ్డుపెట్టింది ప్రతిభ.

ఆమెకి చనిపోయిన తన భర్త గుర్తొచ్చాడు. ఎబ్బెట్టుగా అనిపించింది. రామకృష్ణని దూరంగా తోసేసి లేచి నిల్చుంటూ అంది "ఇప్పటికే చాలా దూరం వచ్చాము. మీ ఆవిగ తంతుంది జాగ్రత్త."

"ఎందుకు తంతుందో చూస్తాను. తనని నేను వప్పిస్తాను. ఓకేనా?" ఆమె జవాబు కోసం ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు.

★★★

మరుసటి రోజు ఉదయం బిందుకి జడ వేస్తోంది ప్రతిభ. రామకృష్ణ పెళ్ళి ప్రస్తావన తెచ్చి వెళ్ళిన దగ్గర్నుంచీ ఆమె మనసు మనసులో లేదు. అతన్ని చేసుకోవాలో వద్దో తనకి తనే నిర్ణయించుకోలేకపోతోంది. చేసుకుంటే తనకతడు తోడౌతాడు. ఒంటరి జీవితంలోకి మలయమారుతంలా వచ్చి పలకరించి వెళ్తాడు. మరతనికి? తను కావాలి. మగవాడు కాబట్టి

అలా కోరుకుంటున్నాడు. ఎంత ప్రాణస్నేహాలేనా ఎవరి జీవితాలు వారివి కాబట్టి ఏదో ఒకప్పుడు విడిపోక తప్పదు. భార్యాభర్తల మధ్య అలాంటి ప్రాణస్నేహం లేకపోయినా చివరిదాకా కలిసుంటున్నారు. కారణం... జీవితాల్ని కలుపుకోవడమే. మరి తామిద్దరూ పెళ్ళి చేసుకుంటే రామకృష్ణ భార్య? ఆమె వప్పుకుంటుందా? ఒప్పుకుంటే.. తనామెకి ఎలాంటి యిబ్బంది కలిగించదు. ఒకవేళ వప్పుకోకపోతే? ఒప్పిస్తానని వెళ్ళాడుగా, రామకృష్ణ ఏం జరిగిందో?

"ఒక జడ లూజు, యింకోటి టైటూను, ఏంటి మమ్మీ?" బిందు విసుక్కుంటే ఆలోచనల్లోంచీ తేరుకుంది.

సరిగ్గా అప్పుడే కాలింగ్‌బెల్ మోగింది. వెళ్ళి తీసింది. ఎదురుగా గుమ్మంలో.. తను వెతుకుతున్న ప్రశ్నకి సమాధానంలా మీనాక్షి. అంటే రామకృష్ణ భార్య. దురాన్నించీ ఒకటి రెండుసార్లు రామకృష్ణతో చూడటం వల్ల గుర్తుపట్టింది ప్రతిభ.

సన్నగా నాజూగ్గా వుంది. గంజిపెట్టిన యిస్త్రీ చీర కట్టుకుంది. రామకృష్ణకి ముగ్గురు పిల్లలని తెలుసు ప్రతిభకి. ముగ్గురు పిల్లల తల్లిలా లేదామె.

"రండి" పక్కకి తప్పుకుని ఆహ్వానించింది. లోపలికొస్తూనే యిల్లంతా పరికించి చూసింది.

"ఇల్లు బావుంది. మీవారున్నప్పుడు కట్టించుకున్నారా?" మామూలుగా అడిగింది. కానీ అందులో సునిశితమైన విమర్శ వుంది. దాన్ని గుర్తించింది ప్రతిభ. ఏం నిర్ణయించింది యీమె? రామకృష్ణ రావల్సినది, తనొచ్చిందేమిటనే ప్రశ్నలు ఆమె బుర్రలో మొదలయ్యాయి. బిందుసందిగ్ధంగా చూస్తోంది.

"ట్యూషన్‌కి వెళ్ళు." అంది బిందుతో. ఆ పిల్ల వెళ్ళిపోయింది.

"ట్యూషన్‌కి వెళ్ళిపోయినట్టేనా?" అంది.

"ఆ..." అంది ప్రతిభ జవాబుగా.

"ఇల్లు... యిల్లంటే నాలుగ్గోడలూ తలుపులూ కిటికీలు కాదనుకుంటాను. మన ఆశలు, ఆశయాలూ, అనుభూతులూ, అనుభవాలూ అందులో నిక్షిప్తం చేసుకుంటాం. అలాంటి యింట్లోకి మరో వ్యక్తిని ఎలా రానిస్తాం? అఫ్‌కోర్స్! మీ అభిప్రాయాలు మీవి కావచ్చనుకోండి." అంది మీనాక్షి.

ఆమె మాటలు నిజమేననిపించాయి ప్రతిభకి. రామకృష్ణ యింట్లోకి స్వతంత్రంగా వచ్చేసి భర్త ఎంతో యిష్టపడే కిటికీ దగ్గిరకి కుర్చీలాక్కుని కూర్చుని కబుర్లు చెప్తుంటే ఎంతో కష్టంగా వుండేది మొదట్లో. తనకి మోరల్‌గా ఎంతో సపోర్టిస్తున్న అతన్నెలా వారించాలో తెలిసేది కాదు. క్రమేపి అలవాటుపడిపోయింది. కానీ అతను స్వతంత్రించి యిల్లంతా తిరుగుతుంటే యిప్పటికీ ఎబ్బెటుగానే వుంటోంది. తన అంతరంగంలోకి అతనికెప్పుడూ ప్రవేశాన్నివ్వలేదు అలాంటిది. అతన్ని తన బెడ్రూమ్‌లోకి ఆహ్వానించగలదా? ఆ తర్వాత భర్త జ్ఞాపకాలు, అనుభూతులు నిండి వున్న తన మనసులోకి?

"మీ అభిప్రాయాలు మీవని చెప్పానుగా? నా వరకూ నేను మా యింటిని మరొకర్తో పంచుకోలేను. నాతో ముడిపడున్న నా భర్త జీవితాన్ని కూడా.." మీనాక్షి చాలా స్పష్టంగా తన అభిప్రాయాన్ని చెప్పింది.

అప్పటిదాకా ఒక సందిగ్ధంలో వూగిసలాడుతున్న ప్రతిభ కొంత నిరాశపడ్డా రిలీఫ్‌గా ఫీలైంది. తను చెయ్యబోతున్నది తప్పో ఒప్పో తెలీదు. సరైన నిర్ణయం తీసుకోవలసిన బాధ్యత మాత్రం వుంది. లేకపోతే పర్యవసానం అనుభవించాల్సింది తనే. ఆ నిర్ణయమేమేదో మరొకరు తీసుకుని నిర్ద్వంద్వంగా ప్రకటించడంవల్ల వచ్చిన రిలీఫ్ అది. అంతేకాదు, తరతరాలుగా జీన్స్‌లో

జీర్ణించుకుపోయిన సాంప్రదాయాలకి ఎదురు తిరగ్గక్కర్లేదని కూడా.

"అలా కాకుండా నా యిష్టాయిష్టాలతో నిమిత్తంలేకుండా పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటే మాత్రం పర్యవసానం తీవ్రంగా వుంటుంది" శ్వాస తీసుకుందుకు ఆగింది మీనాక్షి.

బెదిరిస్తోందా? ప్రతిభ అహం దెబ్బతింది. సూటిగా ఆమె ముఖంలోకి చూసింది మీనాక్షి కూడా నిశితంగా చూసి, తర్వాత ప్రతిభ మనసు చదివినట్టు చెప్పింది. "మా పెళ్ళై యిప్పటికి పన్నెండేళ్ళైంది. ఎంతో కష్టపడి ఒక స్థాయికి వచ్చాం. పిల్లలు పెద్దవాళ్ళై అందివస్తే చాలు, మా బాధ్యతలు పూర్తయినట్టేననుకునేంత సామాన్యమైన ఆశలు మావి. ఇప్పుడు... రామకృష్ణ చెయ్యబోయే పని వలన మా సంసారం అతలాకుతలమౌతుంది. ముఖ్యంగా పిల్లలమీద దీని ప్రభావం చాలా వుంటుంది. వృద్ధిలోకి రావాల్సిన వాళ్ళు చెడిపోతారు."

పిల్లల గురించి ఆమె పడుతున్న తపన చూస్తుంటే ప్రతిభకి సిగ్గేసింది. ఒకవైపు తనది నీతిమాలినతనంగానూ మరోవైపు బిందుపరంగా ఆలోచిస్తే బాధ్యతారాహిత్యంగానూ అనిపించింది.

"రిచ్ విడో మీరు... సాంప్రదాయపు సంకెళ్ళు తెంచుకుని మీరు పెళ్ళి చేసుకోవాలనుకుంటే ఎవరో ఒకరు అర్థం చేసుకుని ముందుకి రాకపోరు. అలాంటిది మీ తోటి వుద్యోగికి కీప్‌గా వుండాలని ఎందుకనుకున్నారు?" ఖంగుమంది మీనాక్షి గొంతు.

చాచిపెట్టి చెంపదెబ్బ కొట్టినట్టైంది ప్రతిభకి. ముఖం రక్తంలేనట్టు పాలిపోయింది. ఎంత అసహ్యకరమైన పరిస్థితి! తనే కోరి తెచ్చుకుంది. భార్యాపిల్లలున్న రామకృష్ణతో అనవసరపు చనువు పెంచుకుంది. మగవాడుగా అతనేం ఆశించాలో అదే ఆశించాడు. ఇస్తే తన విలువ? సంఘంలో తన స్థానం? బిందు భవిష్యత్తు? క్షణంలో ఎంత ప్రలోభంలో పడిపోయింది తను? మరో స్త్రీతో ముడిపడి వున్న అతన్తో జీవితాన్ని తనెలా పంచుకోగలననుకుంది? పంచివ్వటానికి అతని దగ్గిరేం వుందని?

కళ్ళల్లో నీళ్ళు గిర్రుమని తిరిగాయి. వంచిన తల ఎత్తలేదు. సుదీర్ఘంగా నిశ్వసించింది మీనాక్షి. ప్రతిభ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అంది. "తెలిసో తెలియకో కొన్ని పొరపాట్లు చేస్తుంటాము ప్రతిభా! మొదట్లో మీ గురించి యింట్లో చెప్పేవాడు రామకృష్ణ. ఎన్నోసార్లు మీ యింటికి రావాలనుకున్నాను. కానీ తనెప్పుడూ రమ్మనలేదు. ఎందుకెళ్ళాలన్న పంతంతో ఆగిపోయాను. వచ్చివుంటే ఇలాంటి పరిస్థితి ఎదురయ్యేది కాదోమో!"

అప్పటిదాకా తనొక్కమాట కూడా మాట్లాడలేకపోయిన విషయం గుర్తొచ్చింది ప్రతిభకి. వెంటనే అర్థమైంది - రామకృష్ణని తను చేసుకుని వుంటే అప్పుడు కూడా... ఎవరి ముందు తలెత్తుకోగలిగే అవకాశం వుండేది కాదని. మీనాక్షి పట్ల కృతజ్ఞతతో ఆమె మనసంతా నిండిపోయింది. ఒక విధమైన ఆరాధనాభావం కూడా కలిగింది. భర్త మరో స్త్రీ ప్రలోభంలో పడ్డడని తెలిసి కూడా ఎటువంటి వుద్రేకానికీ లోనుకాకుండా, ఎలాంటి అల్లరీ జరగనీకుండా ఎంత నిబ్బరంగా మేనేజ్ చేసింది!

"నా మాట మన్నిస్తున్నట్టే అనుకోనా?" మృదువుగా అడిగింది మీనాక్షి.

"అయాం సారీ!" అప్పటికి నోరిప్పింది ప్రతిభ. "ఒంటరితనంతోటీ నిస్సహాయతతోటీ కొట్టుకుపోతున్న రోజుల్లో మోరల్‌గా ఎంతో సపోర్టిచ్చారు తను. ప్రలోభపడ్డాను" అంది.

"అతనూ ఆశపడ్డాడు. నా అన్నో తమ్ముడో పెడదారి పడుతుంటే చూస్తూ పూరుకోలేను. అలాగే నా భర్త కూడా. వస్తాను థాంక్స్" అంది మీనాక్షి లేస్తూ.

"కాఫీ తాగి వెళ్ళండి" అంది ప్రతిభ తనూ లేచి వంటింటికేసి వెళ్తూ.

కాఫీ తాగి వెళ్ళిపోయింది మీనాక్షి. ఒంటరితనం మళ్ళీ తన వల విసుర్తుంటే నిస్సహాయంగా అలాగే కూర్చుండిపోయింది ప్రతిభ. అది తనని వదలదనీ తన సహజీవనం దానితోనేననీ అర్ధమైంది. ఒక తుపానులా రామకృష్ణ తన జీవితంలోకి వచ్చివెళ్ళాడు. మళ్ళీ అతను రాడనీ, రాకూడదనీ తెలిసీ మనసులో ఏదో ఆరాటం. ఆఫీసు వేళయ్యేదాకా గేటుకేసి చూస్తూ కూర్చుంది.

బిందు ట్యూషన్నించీ వస్తే అన్నం పెట్టి స్కూలుకి పంపించింది.

అతను అటుగా రావాల్సిన వేళ దాటిపోయింది. నిస్పృహతో నిట్టూర్చింది. అంత విషాదంలోనూ ఒక ప్రశాంతత. కూకటివేళ్ళతోసహా చెట్లని పెళ్ళగించి వేసే తుపాను వెళ్ళిపోయాక కూడా ప్రశాంతంగానే వుంటుంది. అలాంటి ప్రశాంతత యిది.